క్లుప్తంగా

350 మందికి వైద్య పరీక్షలు



కంకిపాడు: లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని స్మైల్ లైఫ్ కేర్ ఆసుపత్రిలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు వి.శివరామకృష్ణ ప్రారంభించారు. శిబిరంలో 350 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరంలో ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ వి.వెంకట్, డాక్టర్ పీవీ సురేష్‌కుమార్, డాక్టర్ సి.సుచిత, డాక్టర్ మేఘన వైద్య సేవలు అందించి ప్రజలకు ఆరోగ్య సూచనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఎం.యుగంధర్, ఎస్.నీహార్, మద్దుల గోవిందరావు, రీజనల్ చైర్‌పర్సన్ బండి జ్యోతి, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో 5జీ కమ్యూనికేషన్స్‌కు ప్రాధాన్యం



పెనమలూరు: భవిష్యత్తులో 5 జీ కమ్యూనికేషన్స్‌కు ప్రాధాన్యం ఉంటుందని జర్మనీకి చెందిన శ్రీవాని టెక్నాలజీస్ సీఈవో సచిన్‌శివపూర్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎ సింపోజియం ఆన్ 5జీ కమ్యూనికేషన్స్ అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 5జీ నెట్‌వర్కులో వేగవంతమైన నెట్‌వర్కు, భారీ కనెక్టివిటీ, మెరుగైన మొబైల్ బ్రాడ్‌బ్యాండ్, మెరుగైన ప్రజా భద్రత ఇలా అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. సదస్సులో 400 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 50 మంది విద్యార్థులు 5జీ కమ్యూనికేషన్స్‌పై ప్రెజెంటేషన్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎస్ లక్ష్మణరావు తరఫున సీపీఎం ప్రచారం

నున్న(విజయవాడరూరల్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం నున్న గ్రామంలో సీపీఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోని ఓటు కల్గిన పట్టభద్రులను ఇంటింటికీ వెళ్లి స్వయంగా కలిసి ఓటు అడిగారు. ప్రచారంలో కలకోటి శ్రీనివాసరెడ్డి, అజయ్ ఉన్నారు.

ఏటిపాయలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న మద్దూరు ఏటిపాయ పుష్కరఘాట్
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- చకచకా సాగుతున్న పనులు



ఏటిపాయలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లపై సమీక్ష చేస్తున్న తహసీల్దార్ భావనారాయణ, సర్పంచ్‌లు, అధికారులు

కంకిపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఏటిపాయ వద్ద పుష్కరఘాట్‌ను అన్ని వసతులతో సిద్ధం చేస్తున్నారు. పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఏటిపాయలో జలకళ

మద్దూరు ఏటిపాయ పుష్కరఘాట్ జలకళతో తొణికిసలాడుతోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటితో పాయ నిండుకుండలా దర్శనమిస్తోంది. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏటిపాయలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించటం సంప్రదాయంగా కొనసాగుతోంది. కంకిపాడు మండలంతో పాటుగా ఏటిపాయ వెంబడి ఉన్న పెనమలూరు, తోట్లవల్లూరు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ ఏడాది 50 వేల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముస్తాబవుతున్న శివలింగం

ఏటిపాయ ఒడ్డున ఉన్న శివమందిరం, శివలింగం మహాశివరాత్రికి ముస్తాబవుతున్నాయి. శివలింగానికి భక్తులు నేరుగా అభిషేకాలు, పూజలు జరిపించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఏటి వెంబడి పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసుకునేందుకు నేలను చదును చేస్తున్నారు. ముళ్ల కంప, చెట్లను డోజర్ సాయంతో తొలగిస్తున్నారు. ప్రాంగణం అంతా శుభ్రం చేసి వాహనాల పార్కింగ్, మహిళలు దుస్తులు మార్చుకునే టెంట్‌ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దిష్టమైన ప్రదేశంలో మాత్రమే పుణ్యస్నానం ఆచరించేలా ఏటి పాయలో బారికేడ్లు నిర్మిస్తున్నారు. తాగునీరు, పారిశుద్ధ్య చర్యలపై అధికారులు దృష్టి సారించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఫిషరీస్ శాఖ పర్యవేక్షణతో 20 పడవలు, 20 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

అధికారుల పరిశీలన

పుణ్యస్నానాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు ఏటిపాయను సందర్శించారు. తహసీల్దార్ వి.భావనారాయణ, ఎంపీడీఓ పి.అనూష శనివారం సిబ్బందితో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీని ఆదేశించారు. నిరంతరం నిఘా ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పారిశుద్ధ్య చర్యలు సమర్థంగా తీసుకోవాలని ఆదేశించారు. పరిశీలనలో మద్దూరు, కాసరనేనివారిపాలెం సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

తవ్వారు...పూడ్చకుండా వదిలేశారు!



పోరంకి- నిడమానూరు రోడ్డు పక్కనే ప్రమాదంగా ఉన్న గుంత

పెనమలూరు: పోరంకి-నిడమానూరు ప్రధాన రహదారి పక్కనే గుంత అత్యంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే పోరంకి-నిడమానూరు రోడ్డులో మున్సిపాలిటీ గుంత తవ్వి ఇప్పటివరకు పూడ్చలేదు. దీంతో ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళితే పోరంకి-నిడమానూరు రోడ్డులో బీజేఆర్ నగర్ క్రాస్ వద్ద తాడిగడప మున్సిపాలిటీ అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ తాగునీటి పైప్‌లైన్ కోసం పెద్ద గుంత తవ్వారు. 20 రోజుల క్రితం పనులు మొదలు పెట్టి పనులు అసంపూర్తిగా వదిలేశాడు. రోడ్డుకు ఆనుకుని ఉన్న దాదాపు 7 అడుగుల గుంత పూడ్చకుండా అలాగే వదిలేశారు. బీజేఆర్ నగర్ మలుపు వద్ద గుంత ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోరంకి-నిడమానూరు రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో రాత్రి సమయాల్లో గుంత కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి తవ్విన గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

కాటూరులో పోలీస్ పల్లె నిద్ర



ప్రజలతో ముఖాముఖిలో సీఐ మురళీకృష్ణ ఎస్ఐ సురేష్ కుమార్

ఉయ్యూరురూరల్: గ్రామాల్లో శాంతిభద్రతలు నెలకొల్పేందుకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లె నిద్ర నిర్వహిస్తున్నామని కంకిపాడు సీఐ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కాటూరులో శుక్రవారం రాత్రి ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్ కుమార్‌తో కలిసి ఆయన పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలను నెలకొల్పే లక్ష్యంలో భాగంగానే పల్లెనిద్ర నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో అసాంఘిక సంఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలి యని వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు తెలియపరచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు మండలంలోని ముదునూరు జబర్లపూడి గ్రామాల శివారులో డ్రోన్ కెమెరా ద్వారా నిఘా పటిష్టపరిచారు.

సాంకేతికతతో జీవితంలో విప్లవాత్మక మార్పు



ప్రసంగిస్తున్న రమేష్‌బాబు

పెనమలూరు: సాంకేతికత మన జీవితంలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిందని బెంగళూరుకు చెందిన ఇన్‌టెల్ డేటా సెంటర్ సీనియర్ ఇంజినీర్ కేవీ రమేష్‌బాబు అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం జాతీయ స్థాయిలో జరిగిన సితార్ -2కె25 టెక్నోఫెస్టులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టి ఫలితాలు సాధించగలిగితే మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల శేషసాయి మాట్లాడుతూ టెక్నోకల్చర్ ఫెస్టులను విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. సితార్‌లో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. టెక్నికల్ క్విజ్, బిజినెస్ క్విజ్, విజువలైజింగ్ ఇన్నోవేషన్ తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. భారతీయ సంప్రదాయ వస్త్రధారణ, పాశ్చాత్య నృత్యం, పాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, టెక్నోఫెస్టు కన్వీనర్లు డాక్టర్ బి.రఘుకుమార్, డాక్టర్ వి.జగదీష్, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో రింగ్ ట్రంచ్ పనులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని మామిడి తోటల్లో ఉపాధి పథకంలో భాగంగా రింగ్ ట్రంచ్ పనులు జరుగుతున్నాయి. ఉపాధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళీకృష్ణప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు రోజువారీ వేతనం 300 రూపాయలు లభించాలంటే నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని సూచించారు. నాలుగున్నర మీటర్ల పొడవు, అర్థ మీటరు లోతు, అర్థ మీటర్లు వెడల్పు ఉండేలా ట్రంచ్ పనులు తీయడం ద్వారా రోజువారీ వేతనం లభిస్తుందన్నారు. నున్న, పాతపాడు గ్రామాల్లోని మామిడి తోటల్లో ట్రంచ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు.



సుప్రజ్ఞలో సందడి చేసిన విద్యార్థులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో జరిగిన సాంకేతిక-సాంస్కృతిక ఉత్సవం సుప్రజ్ఞ-2025 రెండవ రోజు ముగింపు శనివారం ఘనంగా జరిగింది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు నృత్యం, గానం, సృజనాత్మక రచనలు, కవిత్వం, డ్యాన్స్ పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య మాట్లాడుతూ సాంకేతిక-సాంస్కృతిక ఉత్సవం సుప్రజ్ఞ-2025 విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన వివిధ కాలేజీల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ మండలపు రవిచంద్, డైరెక్టర్ బావినేని పాండురంగారావు, డీన్ డాక్టర్ డి.వెంకట్రావు, కన్వీనర్ డాక్టర్ ఎం.పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ప్రక్రియ రద్దు చేయాలంటూ రిలే దీక్ష

ఉయ్యూరు: కేంద్ర కార్యాలయ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా చేపట్టిన కౌన్సెలింగ్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉయ్యూరు డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. దీక్షలో ఎన్ఎంయూ నేతలు ఏఎన్ రావు, రవీంద్రబాబు కూర్చున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యుడు డీకే రావు దీక్షను ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా మెయిన్ డిపో సెక్రటరీ కేటీరావు, ప్రతినిధులు ఆనంద్, రాజు, మోహన్, యుఎం రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



పెనమలూరు: గంగూరు వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం గంగూరు సెంటర్‌లో ఓ వ్యక్తి(50) శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారి పక్కనే గాయాలతో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అతడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి 5.5 అడుగుల ఎత్తు, గోధుమ రంగు చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 93904 88364 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డిజిటల్ ప్రసారంలో తాజా ధోరణులపై అవగాహన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐఈటీఈ స్టూడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం డిజిటల్ ప్రసారంలో తాజా ధోరణులు అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విజయవాడ దూరదర్శన్ సీనియర్ ఇంజినీర్ కాశీ ప్రసాద్ డిజిటల్ ప్రసార సాంకేతికతలో జరుగుతున్న తాజా పరిణామాలు, భవిష్యత్ సవాళ్లు, అవకాశాలపై ఉపన్యసించారు. డిజిటల్ ప్రసార వ్యవస్థల్లో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాలు నూతన పరిశోధన గురించి వివరించారు. కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎస్.కీర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు, డీన్ డాక్టర్ సెవ్వగ రాజన్, ఈసీఈ విభాగాధిపతి బి.వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ కానూరు ఆటోనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా ఇండస్ట్రియల్ ఫీడర్లు ఎ,బి,సి బ్లాకులు, 100 అడుగుల రోడ్డు, వివాన్ అపార్టుమెంట్స్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు గమనించి సహకరించాలని సూచించారు.

రేపటి నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు

కంకిపాడు: ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో కంకిపాడు సచివాలయం, ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాల, 27, 28 తేదీల్లో దావులూరు, వేల్పూరు సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. 0-6 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల సాధికారతే యూనియన్ బ్యాంక్ లక్ష్యం



భవానీపురం(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోరంకి, పెనమలూరు బ్రాంచిలకు సంబంధించి డ్వాక్రా రుణాలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (ఎస్‌హెచ్‌జీ) రుణాలపై శనివారం పోరంకి ఎమ్ఎమ్ఎస్ బ్రాంచిలో అవగాహన శిబిరం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కాటం వెంకటరావు సమక్షంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే తమ బ్యాంక్ లక్ష్యమని తెలిపారు. డీఆర్‌హెచ్ తాతాజీ, ఆర్ఎబీడీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, పోరంకి, పెనమలూరు బ్రాంచి మేనేజర్లు సీసీ, బీఓఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఆర్‌డీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ లోన్స్, లఖ్‌పతి దీది, పీఎమ్‌జేబీవై, పీఎమ్ఎస్‌బీవై, ఏపీవై ప్రాముఖ్యతల గురించి వివరించారు.

పీఎం శ్రీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయండి

సమగ్ర శిక్ష జిల్లా అదనపు కోఆర్డినేటర్ ఫణి ధూర్జటి

ఉయ్యూరురూరల్: నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్న పీఎం శ్రీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఫణి ధూర్జటి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాలను ఆయన శనివారం పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేస్తున్న భవనాలు అత్యంత అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక విద్యార్థులు పాఠశాల యాజమాన్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధారాణి ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యనమలకుదురు బార్‌లో ఘర్షణ

పెనమలూరు: యనమలకుదురులో బార్ షాపులో ఘర్షణ జరిగి ఇద్దరు వ్యక్తులకు గాయాలవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తెనాలి పాండురంగపేటకు చెందిన వెలగ విజయ్‌చౌదరి విజయవాడ భవానీపురంలో వస్త్ర దుకాణంలో పని చేస్తాడు. అతను శుక్రవారం యనమలకుదురులో మిత్రుడు చిట్టిబాబును కలిసి ఇద్దరూ కలసి కరకట్ట వద్ద ఉన్న బార్‌షాపులో కూర్చున్నారు. అయితే అక్కడే ఉన్న సుంకర కళ్యాణ్‌తేజ్, దోవ మధు మద్యం మత్తులో అకారణంగా గొడవపడి విజయ్‌చౌదరి, చిట్టిబాబుపై దాడి చేసి గాయపరిచారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ఉయ్యూరురూరల్: మండలంలోని పెదఓగిరాలలో శనివారం చెత్త నుంచి సంపద తయారీ అంశంపై ఒకరోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి జ్యోతి మాట్లాడుతూ తడి, పొడి చెత్తలు ఇతర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడంతో పాటు వేరువేరుగా ఎరువు తయారీ కేంద్రాలకు తరలించడం ద్వారా సంపద సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో గుడివాడ డీఎల్పీఓ సంపత్ కుమారి, ఎంపీడీవో శేషగిరిరావు, పమిడిముక్కల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు ఉయ్యూరు ఈఓఆర్డీ ఏఎస్ కోటేశ్వరరావుతోపాటు ఉయ్యూరు, పమిడిముక్కల, పెదపారుపూడి మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ 5 కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పొట్టేళ్ల ప్రభ బండి ఊరేగింపు



పాల పొంగలి సిద్ధం చేస్తున్న మహిళా భక్తులు





ప్రసాదం స్వీకరిస్తున్న నూతన వధూవరులు

● ఆఖరి రోజు పోటెత్తిన భక్తులు

వీరమ్మతల్లి తిరునాళ్లకు చివరి రోజు భక్తులు పోటెత్తారు. 15 రోజుల పాటు వైభవంగా సాగిన ఈ తిరునాళ్లు శనివారంతో ముగిశాయి. శనివారం పెద్ద ముఠా కార్మికులు, కూరగాయల మార్కెట్ కార్మికులు జోడు పొట్టేళ్ల ప్రభ బండ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రభ బండ్లు కానుకగా సమర్పించారు.

–ఉయ్యూరు